# ఐదో అవతారం

ఘంటా

ప్రపంచాలుగో అవతారాన్ని చాలించి ఐదో అవతారానికి పన్నాగం పన్నుతూ ఉన్నామన్న మాట. మళ్లా ఈదఫా ఏఅవతారం దాలిస్తే మన ఆటలు నిరాటంకంగా సాగుతాయా? అన్న మెలికతో చిక్కుకొని ఉక్కిరి బిక్కిరి ఐపోతున్నాం. ఇలా హఠాత్తుగా అవతారం మార్చటానికి కారణ భూతమైన ఐదు వేల మొత్తం రెండు జేబుల్లో (మరిమనమెప్పుడూ రెండుజేబులున్న చొక్కాలే తొడుగుతాంగా!) సరిసమానంగా చేరి మనకు ఒక్కనిమిషంగూడ తీరిక లేకుండా చేస్తూంది. 'ఉత్పత్తిదారు' అవతారము అన్నివిధాం శ్రేయస్కరమయిందని తేల్చుకోగానే- ఏవిధమైన ఉత్పత్తి? అన్న కొశ్చన్ ఒకటి బయలుదేరింది. దీన్ని గురించి ఆలోచించుకుంటూ నాలుబజార్లూతిరిగి, మధ్యబజారుగుండా తిరిగివస్తూంటే ఒక కూల్ డ్రింక్స షాపు మననేత్రాల్లో మెరిసింది. బయట నుంచి చూస్తుంటే అషాపు ఎంతో ఆకర్షణీయంగా ఉంది. రంగులతో చెక్కబడ్డ గుండ్రని అక్షరాల సైనుబోర్డు; పెద్దస్టాండు; దానిమీద డ్రింక్సతో నింపబడి వరుసగా అమర్చబడ్డ సీసాలు; షాపులోపల బెల్జియం అద్దాలు. వీటన్నిటిని చూస్తూ అలానే నిల్చుండి పోయేను. ఆషాపు ఇదివరకు ఎన్నోసార్లుచూసేను గాని ప్రస్తుతం దానిలో ఒకప్రత్యేకత - మన కొశ్చన్ని సాల్వుచేయడానికి కొంతఅనుకూలత కనుపిస్తూ ఉండడం మూలాన ఆలోచన ఈప్రపంచాన్ని వీడి మరో ప్రపంచంలోకి ఉడాయించింది. అషాపువాడు ఎంతో ఆప్యాయంగా 'రంజన కూల్ డ్రిక్ ఒక్కటి పుచ్చుకోండిబాబు మీ అలసట తీరిపోతుంది' అన్నాడు. మనం త్రుళ్ళిపడిమనఆలోచనల్ని ఛప్పునవెనక్కిలాక్కొని అషాపులో ప్రవేశించేం. అడ్రింకు మననోటి ద్వారాన్ని దాటగానే మనమెదడు ఘటాలు పనిచేయడం మన కొశ్చన్ సాల్వుకావడం ఒక్కసారే జరిగింది. అంతిచక్కని నిర్ణయానికి మనలను తేటానికి హేతుభూతమైన ఆడ్రింక్ కు వేయికందనాలుసమర్పించుకున్నాం. షాపువాడు కూల్ డ్రింక్సలో అనుభవమున్న వాడు కాబట్టి మనకున్న చిన్న చిన్న సందేహాల్ని తీర్చుకోటానికి తోడ్పడతాడని వాడ్ని పిలిచి మనకార్యక్రమాన్ని ఎరుకపరచ దలచేను. "ఏమోయ్! సుబ్బారావు ఈవూళ్ళో ముఖ్యంగా ఈబజార్లో కూల్ డ్రింక్సకు మంచిడిమాండ్ ఉన్నట్టున్నది" అన్నాం. 'ఏదో మీదయవల్ల' అన్నాడు షాపువాడు. 'ఏకోనిగ్గూ దలాభపాటి అయ్యో ఒక్క విషయం చెప్తాను, వింటావా' అన్నాం ధీమాగా. 'చెప్పండిబాబు అంతకం నానా' అని వాడుస్టూలు ఒకటి లాక్కొనిదగ్గరగా కూర్చున్నాడు. మనంగొంతు సరిచేసుకొని 'మనదగ్గర పెట్టుబడి పెట్టడానికి కావలసినంత డబ్బుంది; కూల్ డ్రింక్స ఫ్యాక్టరీఒకటిఓపెన్ చేద్దామనుకుంటున్నాను, మంచిదేనా' అన్నాం. వాడు నాలుకచప్పరించి బల్లమీది ఖాళీసీసాను పైకితీసి 'ఈరంజన్ కూల్ డ్రింక్స ఉన్నంత కాలం ఈవూళ్ళో ఇంకోకడ్రింకు అమ్ముడు పోదు' అన్నాడు. 'ఏం, అదంత మంచి సరుకా?' అన్నాం ముఖముచిట్లిస్తూ. 'మంచిదీ మంచిది కాదూ అన్నసంగతి అటుంచి దాన్ని గురించి ప్రజల్లోజరిగిన ప్రచారము అలాంటిది' అన్నాడు. 'అకంపెనీకంటె ఎక్కువవెచ్చించి ఎక్కువపేపర్లలో ఎడ్వర్టైజ్ చేస్తే సరిపోతుందికదా!' అన్నాం. 'తమరు వెయ్యిపేపర్లలో ఎడ్వర్టైజ్ చేసినాలాభంలేదు. రంజనకంపెనీ వాళ్లు ప్రచారనిమిత్తం దమ్మిడీఖర్చు పెట్టలేదు; పెట్టరు' అన్నాడు. 'ప్రజలకు దానిమీద అంత

అభిమానం దేనికి' అన్నాం నిరుత్సాహంగా. 'మీకు వినాలని కుతూహలంగా ఉంటే అసలు సంగతి చెప్తాను, వినండి!' అని మొదలు పెట్టేడు!

'నేను ఐదు సంవత్సరాలనుండి ఈ షాపును నడుపుతున్నాను మొదటి రెండు సంవత్సరాలూ వ్యాపారం మందకొండిగా నడిచింది. కాని మూడు సంవత్సరాల నుంచి ఆరుగురు సర్వర్సు పనిచేస్తుంటేగాని తట్టుకోలేకుండా ఉన్నా. అందుకు 'ఈ రంజన కూల్ డ్రింక్స్' ముఖ్య కారణమని చెప్పాలి.

'ఒకనాడు ఇద్దరు పెద్దమనుష్యులు (వేషాన్ని బట్టి) నా షాపు దగ్గరకు వచ్చి కూల్ డ్రింక్ ఇవ్వమన్నారు - రంజన కూల్ డ్రింకులు అప్పుడే కొత్తగా షాపులోకి వచ్చాయి. వాటికేమంత డిమాండు లేదు. ఆ పెద్దమనుష్యులకు వాటిల్లో నే రెండు సీసాలు తీసిఇచ్చేను. ఒకాయన ఖాళీ సీసాను తిరిగిస్తూ 'అబ్బ ఎంతమధురంగా ఉంది అమృతంతో సమానము' అన్నాడు. రెండో ఆయన నన్నుద్దేశించి 'ఎక్కడ తెచ్చేవయ్యా ఈ పాడుసీసాలు, నోరంతా చెడి పోయింది' అంటూ సీసాను నేలమీదికి వంచేడు. మొదటాయన కొంచెం తీక్షణంగా 'ఎప్పుడైనా డ్రింక్స్ తాగిన ముఖమేనా!' అన్నాడు. రెండు ఆయన 'ఎప్పుడైనా రుచిచేస్తే, గబ్బు వాటినిగూడ అమృతం అనకపోదువు' అన్నాడు సలోక్తిగా? మొదటాయన చేతుల్ని పైకి తీస్తూ 'ఇప్పుడన్నమాట మళ్ళాఅను' అన్నాడు. రెండో ఆయనగూడ ఏమాత్రం తగ్గకుండ 'నీవిందాకన్నమాట మళ్ళాఅను' అన్నాడో లేదో ఇద్దరిచేతులు కలిసేయి. ముష్టియుద్ధం ప్రారంభమై మహాజోరుగా సాగిపోతూఉంది. చుట్టుప్రక్కలజనమంతా నాషాపుముందు గుంపులుగుంపులుగా చేరుకున్నారు. ట్రాఫిక్ అంతాబందయిపోయింది ఈ బజారంతా తిర్ణాల నిధి గామారిపోయింది. ఇంతలో ఇద్దరుముగ్గురు ముందుకువచ్చి వాళ్ళను పట్టుకున్నారు. వాళ్ళిద్దరు అలసిపోయి చెరొక పక్కన కూలబడ్డారు. జనసమూహపు కోరిక మీదనేను అసలువిషయాన్ని ఎరుకపరుస్తూవుండగా ఘటుక్కున మళ్ళా వాళ్ళల్లో ఒకడు దివ్వన లేచిబంటికాలిమీద నుంచుని 'మోటివాడికి మొగిలిపూలిస్తే' అనిఇంకేదోఅనబోతూండగా, రెండోవాడు మిన్నాగులా ఎగిరి "నోరుమూయ్" అని పెద్దగాఅరిచేడు. "నేను నోరుమూసేదీ, నీవు నోరుమూసేదీ ఇప్పుడే తేలుస్తాను, ఉండు" "అని మొదటాయన నాదగ్గరఉన్న పదిసీసాల్ని రంజన కంపెనీవి, పదిమందికి పంచియిచ్చి వాళ్ళను రుచిచూచి దానిగుణాన్ని తేల్చమన్నాడు, అందులో తొమ్మిదిమంది దివ్యంగా ఉంది అన్నారు. ఒక్కన్యాయమూర్తి మాత్రము "హోప్ లెస్" అన్నాడు. దానితో రెండో ఆయన తలకాయ వంచుకొని ఎక్కడికోవెళ్ళిపోయేడు. మొదటి ఆయన తనమాట నెగ్గిందన్న ధీమాతో చిన్నలెక్చరుకొట్టి ఆ పన్నెండుసీసాలకయిన మొత్తాన్ని చెల్లించి వెళ్ళిపోయేడు.

'అన్ని బజారులోకి ఈసంగతి వ్యాపించిపోయింది. మరుసటిరోజు అన్నిదినపత్రికలు ఈ సంఘటన్ని ప్రాముఖ్యంగా ప్రచురించేయి. కొన్నివారపత్రికలు ఈసంఘటనమీద కొన్ని కథలల్లేయి. దానితో దమ్మిడి ఖర్చుపెట్టకుండానే "రంజన" కూల్ డ్రింక్స్ కు బహుళ ప్రచారము జరిగింది. అప్పటినుండి ఈ టౌనులో ప్రతివాడు రంజనకూల్ డ్రింక్ తప్పితే ఇంకొకటి పుచ్చుకోడు.

"వాళ్ళిద్దరిని పోలీసులు అరెస్టుచేయలేదా, పబ్లిక్ గా తన్నుకొన్నందుకు" అన్నాం విడు చెప్పిన దాంతో ఎంతవరకు నిజముందో తేల్చుకుందామని.

"ఆవిషయము భగవంతుడికి తెలియాలిగాని ఆ పెద్దమనుషులిద్దరు ఆ కంపెనీ ఏజంట్లని కొద్ది రోజుల కిందట నాకు తెలిసింది" అన్నాడు.

మనబుర్రనుగూడ పుర్దవచేసి మన ఐదోఅవతారానికి కావలసిన ఏర్పాట్లన్ని చేసుకుందామన్న దృఢనిశ్చయంతో ఇంటిదారి పట్టేము.